# కలలు పగుల గొడుతున్నాను

కలలు పగుల గొడుతున్నాను !
రంగు రంగుల పింగాణీగాజు కలలు
మేలిమి బంగరు కలలు, అన్నీ పగుల గొడుతున్నాను
పురాణ పానపాత్రలు బ్రద్దలు గొడుతున్నాను
(చిల్లపెంకులు పిల్లలకైనా పనికొస్తాయి)
భుక్త రిక్త పాత్రలు నేను ఏమిచేసుకొంటాను ?
అందుకనే అవి బ్రద్దలు కొడుతున్నాను.
కలలు పగులగొడుతున్నాను

దప్పిగొన్న పెదవుల్లా బీటలు వారిననేల
దూరాన దూది పింజల మబ్బుల్లో లేదు హాల
రిక్త ధరణి, గగన పాత్రలు, కన్నీరైనా లేవు,
నెత్తుటి పాటల ధూళి ఎర్రగా రేగే రేవు
కసితో, అక్కసుతో నేను దుమ్మురేపుతున్నాను
కలలు పగులగొడుతున్నాను.

శేష మెందుకు ?
విక్రయం ముగిసేవేళ కృపణాశాలేశ మెందుకు ?
శేషమున్నది వికృతమై నిశ్శేషం కాకమానదు
పూలు క్రుళ్ళిపోతాయి, భావం బాసిపోతుంది
కాటుక చారల వెనుక కుంకుమ మాసిపోతుంది
వేయిచెప్పు రేయి రాకమానదు
తమస్సుకు స్వాగత మిస్తున్నాను.
వేల వన్నెలు చాయలు చెరిపివేస్తున్నాను
కలత నిదుర కాకుండా కలలు పగులగొడుతున్నాను.

---

బైరాగి

---

ఒకనాడు నేనుకూడా సృజియించాను
కో కొల్లల హరివిల్లుల మెరుపు జడులు కురిపించాను.
కల్పనతో, శిల్పంతో సౌందర్యపు ప్రతిమలు నిర్మించాను
శిలలు తొలచి విగ్రహాలు మలచాను
నే సృజియించిన ప్రతిమలు నేనే చూచి వలచాను, కొలిచాను.
చివరకు అవి నన్నే బలి కోరినాయి
కోపంవచ్చి వాటిని బలి ఇస్తున్నాను
ఓపికగా ఒక్కొక్కటొకటి బ్రద్దలు గొడుతున్నాను.
కలలు పగులగొడుతున్నాను.

హృదయపు గర్భగుడిలోని ప్రాణ ప్రతిమను కూడ
నెత్తుటి వ్రేళ్ళతోటి పెకళించి పారవేసిన నేను
ఈ క్షుద్ర ప్రతిమల నెలా సహిస్తాను, క్షమిస్తాను?
మొహమద్ గజనీని నేను, విగ్రహాలు బ్రద్దలు గొడుతున్నాను.
విగ్రహాంతకుడనే గాని, నేను విగ్రహ విక్రేతను కాను, కాను.
ఈ ఖండిత విగ్రహాలు, శకలీకృత నిర్ఘృణ మృత పాషాణాలు
నే నిర్మించే సుందర మందిరాల సోపానాలు.
మందిర మొకటి నిర్మిస్తున్నాను నేను.
అందులో ప్రాణ ప్రతిష్ఠ చేస్తున్నాను
నిశిధ నైరాశ్యానికి, శూన్యానికి,
చిదంబర రహస్యానికి